# జల్లికట్టులో విషాదం..
## వ్యక్తి మృతి.. పలువురికి గాయాలు

వి.కోట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



మృతి చెందిన శీనప్ప

వి.కోట మండలం ఎర్రినాగేపల్లిలో మంగళవారం నిర్వహించిన జల్లికట్టులో విషాదం నెలకొంది. ఎద్దులను నిలువరించే క్రమంలో ఎద్దు ఢీకొని మోర్నపల్లికి చెందిన శీనప్ప (54) దుర్మరణం చెందాడు. పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఎద్దు ఢీకొనడంతో నేలకూలిన శీనప్పను స్థానికులు వి.కోట ఆస్పత్రికి తరలించగావైద్యులు పరీక్షించి అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు కలరు. మృతదేహంను పంచనామాకు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక వార్త




# రెండో రోజు ఏసీబీ అధికారుల తనిఖీలు

వెంకటగిరి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:



మున్సిపల్ కార్యాలయంలో అధికారులు రెండో రోజు కూడా తనిఖీలు చేశారు. టౌన్ ప్లానింగ్ ద్వారా పట్టణంలో నిర్మించిన భవనాలను పరిశీలించి కొలతలు తీసుకున్నారు. సోమవారం రాత్రంతా ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. పట్టణంలోని టౌన్ ప్లానింగ్ శాఖ ద్వారా నిర్మించిన భవనాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మించినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. పట్టణంలోని తూర్పు వీధిలో బహుళ అంతస్తు భవనాలను కొలతలు తీశారు. కైవల్యా నది పక్కన నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ కొలతలు చేశారు. రికార్డులను సీజ్ చేసి తీసుకెళ్లారు. తనిఖీల్లో ఏఎస్పీ దేవాప్రసాద్, డీఎస్పీ జనార్థన్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

# అన్ని పార్టీల్లోనూ లుకలుకలే!

### నాయకత్వలేమితో టిడిపి సతమతం
### ప్రజల ఆశీస్సులున్నా పరిస్థితి అంచనా వేయలేని అధికారపార్టీ
### ఉనికి చాటుకోలేని జనసేన,కాంగ్రెస్ పార్టీ నేతలు

ప్రభాతవార్త–తిరుపతి:

నాలుగేళ్ళ అధికారంలో ప్రజలకు చేసిన మంచిని చెప్పుకోలేక , ప్రజల్లో నెలకొన్న అరకొర అసమ్మతి, అసంతృప్తులను అనుకూలంగా మలచుకోలేకపోతున్న వైసిపి నాయకుల పనితీరు, పూర్తిస్థాయిలో నాయకత్వలేమితో కొట్టుమిట్టాడుతున్న ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ శ్రేణులు,వర్గాలు...కనీసం తమ తమ పార్టీ ఉనికిని చాటుకోలేకపోతున్న జనసేన,కాంగ్రెస్ పార్టీల నేతల తీరు అటు చిత్తూరుజిల్లాలో,ఇటు తిరుపతి జిల్లాలో ఎన్నికల నాటికి ఏమవుతామనేది ఆయా పార్టీల్లో లుకలుకలు మొదలయ్యాయి. జిల్లాల విభజన తరువాత ఉమ్మడి చిత్తూరుజిల్లా నుంచి మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి నియోజకవర్గాలు అన్నమయ్యజిల్లా క్రిందకు వెళ్ళినా, ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట నియోజకవర్గాలు తిరుపతి జిల్లాకు చేరాయి. ఈ నియోజకవర్గాల పరిధి కొత్తజిల్లాల్లోకి వెళ్ళడంతో డివిజన్ల ఏర్పాటు కూడా స్థానిక ప్రజలకు కొంత ఇబ్బందికరంగా తయారయ్యాయనే విమర్శలు ప్రజల్లో చర్చ జరుగూతూనే ఉంది. ఈ సమస్యను పరిష్కరించడంలో అధికార పార్టీ నేతలు ప్రజలకు అనుకూలంగా వ్యవహరించలేకపోయారనే వాదనలు బలంగా ఉన్నాయి. ఈ నేపధ్యంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా రెండు జిల్లాల్లో అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకంగా తయారవడంతో ఎవరికి ఎంతవరకు సానుకూలత కనిపిస్తుందనే అంచనా వేయలేక తలలుపట్టుకుంటున్నారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో 14 నియోజకవర్గాలకు గాను 2019 ఎన్నికల్లో కుప్పం మినహా మిగిలిన 13 చోట్ల వైసిపి అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలిచారు. గత నాలుగుసంవత్సరాలుగా పాలనలో ఉన్నారు. వీరిలో ఇప్పటికే అధికశాతంమంది ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తుండటంతో పరిస్థితి తారుమారయ్యే అవకాశాలు



లేకపోలేదనేది జిల్లావాసుల్లో చర్చ మొదలైంది. ఇదే విషయంగా స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా పనితీరు బాగోలేకుంటే టిక్కెట్లు ఇచ్చేదిలేదని కొంతమంది ఎమ్మెల్యేలకు పరోక్షంగా సంకేతాలిస్తుండటం కొసమెరుపు. ఈ వరుసలో జిల్లాలో కొందరి పేర్లు గుప్పుమంటున్నా బయటకు చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నారు. ఈ క్రమంలో వైసిపి అధినేత, ముఖ్యమంత్రి జగన్ కూడా ప్రజలమధ్యకు వచ్చేందుకు సిద్దమై బస్సుయాత్ర చేపట్టాలని సమాచారం పొక్కడంతో కొందరు నేతలు అందుకు తగ్గట్లు సిద్ధమయ్యేందుకు ఏర్పాట్లు చేసుకోనున్నారు. ఇక ప్రతిపక్ష తెలుగుదేశంకు రెండు జిల్లాల్లో బలమైన ఓటు బ్యాంకు, అభిమానులు, చెక్కుచెదరని కార్యకర్తలు ఉన్నా దాదాపు అత్యధిక నియోజకవర్గాల్లో నాయకత్వలేమితో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే టిడిపి యువనేత నారాలోకేష్ యువగళం పేరుతో చిత్తూరుజిల్లాలో పదిరోజులుగా పాదయాత్ర మొదలుపెట్టినా నియోజకవర్గాల్లో బలమైన ఇన్‌ఛార్జీలు లేరనే విషయం గ్రహించలేకపోతున్నారు. పార్టీ నాయకత్వం మార్పుచేసి, స్థానిక ప్రజలకు చేరువగా ఉండే, ధీటైన నాయకుడిని ఎంపికచేయలేని పరిస్థితిలో ఉన్నారు. స్వయంగా ప్రజలతో మమేకమవుతున్నా నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థి పేరును వెల్లడించే ధైర్యం చేయలేకపోతుండటం కొంత వరకు మైనస్‌గా మారింది. జనసేన, కాంగ్రెస్ పార్టీలు రెండు జిల్లాల్లో ఒకరిద్దరు తప్ప మిగిలిన చోట్ల కనీసం ప్రజల్లో తమ ఉనికిని కూడా చాటుకోలేని ధైన్యస్థితిలో కొట్టుమిట్టాడుతూన్నారు.

# జిల్లాకు ఒకొక్క క్రిమినల్‌ను తయారుచేశారు

### మంత్రి పెద్దిరెడ్డిని గురిపెట్టిన నారా లోకేష్
### చిత్తూరులో ఎమ్మెల్యే ఆరణి రూ.500 కోట్ల జె టాక్స్ వసూలు



చిత్తూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:

రాష్ట్రంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒకొక్క జిల్లాలకు ఒకొక్క క్రిమినల్‌ను తయారు చేశారని జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయ ఆవరణలో మంగళవారం జరిగిన బహిరంగ సభలో నారా లోకేష్ మాట్లాడుతూ జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గనులు, ఇసుకను భారీగా దోచుకొని క్రిమినల్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భూబకాసురుడుగా మారారని, గత మూడున్నర సంవత్సరాలుగా ఎమ్మెల్యే ప్రజల నుండి అనధికారికంగా 500 కోట్ల రూపాయల మేరకు జె టాక్స్‌ను వసూలు చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దృష్టికి ఎక్కడైనా కొండ, గుట్ట, పేదల ఇళ్ళ స్థలాలు, రిటైర్డ్ సైనికుల స్థలాలు కన్పిస్తే కబ్జా చేసి ఆక్రమించుకొంటున్నారని ఆరోపించారు. చిత్తూరు నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు 300 ఎకరాల భూములను ఇప్పటికే మింగేశారన్నారు. గుడిపాల మండలం నారగల్లు పంచాయతీ పరిధిలో పశువుల మేత కోసం అనాదిగా వుంచిన 200 ఎకరాలను ఎమ్మెల్యే తమ బినామీల పేరిట కబ్బా చేసుకొన్నారని ఆరోపించారు. అలాగే చిత్తూరు రూరల్ మండలం కుర్చీవేడు గ్రామ రహదారికి ప్రక్కన 80 ఎకరాల పరిధిలో ఎమ్మెల్యే అనధికారికంగా క్వారీని నిర్వహిస్తూ కోట్ల రూపాయలు గడిస్తున్నారని ఆరోపించారు. ఇక్కడే ఒక కాంట్రాక్టర్‌ను బెదిరించి అతని నుండి 6 కోట్ల రూపాయలు వసూలు చేశారన్నారు. చిత్తూరులో బాగున్న ప్రభుత్వ భవనాలను కూల్చివేయడం దాని స్థానంలో తన సంస్థ తరపున కొత్త భవనం నిర్మించి నిధులు స్వాహా చేయడం ఎమ్మెల్యే పనిగా పెట్టుకొన్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సిఎం రిలీఫ్ ఫండ్ బాధితులను సైతం వదలిపెట్టడం లేదని ఆరోపించారు. సిఎం రిలీఫ్‌ఫండ్ మంజూరైన వారి నుండి 20 శాతం కమీషన్ పుచ్చుకొంటున్నారని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తినాని, మాజీ మేయర్ కఠారి హేమలత, రాష్ట్ర తెలుగుదేశం ఎస్సీ సెల్ నాయకులు సప్తగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఆంధ్ర..తమిళనాడు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీలకు
# చంద్రబాబు లేఖ
### కుప్పంలో గ్రానైట్ అక్రమ రవాణా అరికట్టాలని వినతి !!



కుప్పం,ఫిబ్రవరి 7 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గం నుంచి తమిళనాడు మీదుగా జరుగు తున్న గ్రానైట్ అక్రమ రవాణాకు చెక్ పెట్టాలని ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు మంగళవారం ఎపి, తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు వేర్వేరుగా లేఖలు రాశారు. కుప్పం ప్రాంతంలో గ్రానైట్ స్మగ్లింగ్ మాఫియా అక్రమంగా అపారమైన గ్రానైట్ బ్లాక్‌లను స్మగ్లింగ్ చేస్తోందన్నారు. శాంతిపురం, కుప్పం మండలాల్లో అక్రమ క్వారీలు నిర్వహిస్తూ గ్రానైట్ బ్లాక్‌లను రాత్రిపూట అక్రమంగా తమిళ నాడులోని కృష్ణగిరి, వేలూరు జిల్లాలమీదుగా తరలిస్తు న్నారని లేఖలో పేర్కొన్నారు. కుప్పం మండలం నడిమూరు, గుడుపల్లె మండలం ఒఎన్ కొత్తూరు మార్గాలనుంచి తమిళనాడు కృష్ణగిరి జిల్లా వేపనపల్లి, అలాగే కుప్పం మండలం మోట్లచేను మీదుగా తమిళనాడులోని పచ్చూరుమీదుగా గ్రానైట్‌ను తరలిస్తున్నార న్నారు. ఈ అక్రమ గ్రానైట్ రవాణా వెనుక ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజకీయ నేతల హస్తం ఉందని ఇరు రాష్ట్రాల ప్రజలు భావిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి గ్రానైట్ మాఫియా ద్వారా గ్రానైట్ బ్లాక్‌ల అక్రమ రవాణాను అరికట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎపి సిఎస్‌ను లేఖలో కోరారు. అలాగే తమిళనాడు మీదుగాజరిగే గ్రానైట్ అక్రమరవాణాను అడ్డుకోవాలని తమిళనాడు చీఫ్‌సెక్రటరీని లేఖలో కోరారు.

# ఇండోర్ స్టేడియం పనులు కమిషనర్ పరిశీలన



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త

తిరుపతి పరిధిలోని తుడా మార్గంలో స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి పరిశీలించారు. మంగళవారం సాయంత్రం ఇంజినీరింగ్, ఏఈకామ్ ప్రతినిధులతో కలిసి పనులను పరిశీలిస్తూ పనులు షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయకుండా ఆలస్యంగా చేస్తుండడంతో కమిషనర్ అగ్రహం వ్యక్తం చేసారు. మరో రెండు రోజుల్లో తిరిగి వచ్చి పనులు పరిశీలిస్తానని, ఈ లోపు త్వరగా పనులు పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. పనులు త్వరగా చేయాలని ఎదో ఒకటి చేస్తే ఊరుకోమని నాణ్యమైన వస్తువులనే వినియోగించాలన్నారు. ఇండోర్ స్టేడియంలో కబడ్డి, సెటిల్, బ్యాడ్మింటన్, స్నూకర్, జిమ్నాజియం కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. కమిషనర్ అనుపమ వెంట మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డిఈ మోహన్, ఏఈకామ్ ప్రతినిధులు బాలాజీ, అనిల్ తదితరులు ఉన్నారు.

# నోరు అదుపులో పెట్టుకోకుంటే గుణపాఠం తప్పదు
### - లోకేష్‌కు మంత్రి రోజా హెచ్చరిక

నగరి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:



లోకేష్ నోరు అదుపులో పెట్టుకోకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని మంత్రి రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. మబ్బు పట్టి సూరీడు రావడం లేటుగా వస్తాడేమో వలంటీర్లు ఉదయాన్నే తలుపు తట్టి పెన్షన్ ఇస్తారని మంత్రి రోజా తెలిపారు. నగరిలోని మంత్రి కార్యాలయ ఆవరణలో మంగళవారం జరిగిన పుత్తూరు గ్రామీణ మండల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టీడీపీ పార్టీని చీపురులతో ఊడ్చి చాటలో పడేశారని, ఆ పార్టీ నాయకులు పాదయాత్రలో ఇష్టానుసారంగా జగనన్న పాలనపై మాట్లాడే నైతిక హక్కు వారికి లేదని విమర్శించారు. 2024 ఎన్నికల్లో జగనన్న నెంబర్ వన్ సీఎంగా రావడం ఖాయమన్నారు. సచివాలయ పరిధిలో పార్టీ కార్యక్రమాలు చురుగ్గా కొనసాగడానికి వీరు పని చేస్తారన్నారు. గృహ సారథులుగా వైసీపీపై అభిమానం కలిగి ఉత్సాహంగా, చక్కగా పని చేస్తూ ఓపికతో ప్రజల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలు వారికి వివరించే వారినే నియమించామని అన్నారు. సమావేశంలో పుత్తూరు గ్రామీణ మండల సచివాలయ కన్వీనర్లు, పార్టీ కన్వీనర్, ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్‌ఎంపీపీలు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, రాష్ట్ర డైరెక్టర్లు, కమిటీల చైర్మన్‌లు, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ సారథులు, వలంటీర్లు, వైసీపీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రణాళికబద్ధంగా
# క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టాలి
### - తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే, వ్యాధిని నయం చేసుకోవచ్చునని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. జిల్లాలోని స్విమ్స్, స్వికార్, ఎస్వీ ఆయుర్వేదిక్ ఆసుపత్రుల సమన్వయంతో ప్రణాళికబద్ధంగా క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రక్రియ నిర్వహించటానికి స్విమ్స్, స్వికార్, ఆయుర్వేదిక్ ఆసుపత్రుల డాక్టర్లతో, జిల్లా కలెక్టర్ ప్రణాళిక తయారు ప్రక్రియ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జనాభలో 10శాతం మంది క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని, సర్వేలు తెలుపుతున్నాయన్నారు. మన జిల్లాలో 2021లో 10వేల మందికి పరీక్షలు చేస్తే 44 కేసులు నమోదు కాగా, 2022లో 13వేల మందికి పరీక్షలు చేస్తే 65 కేసులు నమోదైనట్లు తెలిపారు. ఇందులో మహిళలలే 67శాతంగా ఉన్నారని, దీన్నిబట్టి చూస్తే మహిళల అధికంగా 45 వయస్సుపైబడిన మహిళలు క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ నివారణ వైద్య చికిత్సలకు ప్రత్యేక ప్రాధాన్యతలు ఇవ్వాలని నిర్ణయించిందని, ఆ మేరకు జిల్లాలో చేపట్టాల్సిన ప్రక్రియపై ప్రభుత్వానికి నివేదించాలన్నారు. జిల్లాలో 691 సచివాలయాల పరిధిలో వైద్య సిబ్బంది 2000పైగా ఉన్నారని, వారికి శిక్షణ ఇచ్చి క్యాన్సర్ గుర్తుంపుపై వీరి సేవలు ఉపయోగించుకోవాలన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమీక్షలో డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శ్రీహరి, స్విమ్స్ డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ చంద్రశేఖర్, ఎస్వీ ఆయుర్వేదిక్ ఆసుపత్రి రేణుదీక్షిత్, ప్రిన్సిపల్ మురళీ కృష్ణ, డాక్టర్ విజయభాస్కర్, స్వికార్ పి.వి. హేమంత్, డాక్టర్ హర్షవర్ధన్‌లు పాల్గొన్నారు.

# ఆగమోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



చంద్రగిరి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:

శ్రీనివాసమంగాపులో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఆగమోక్తంగా నిర్వహించారు. ఈ నెల 11 నుండి 19 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రోజున ఆలయ శుద్ధి చేశారు. ఇందులో భాగంగా ఉదయం 6.30 గంటల నుండి 11 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయశుద్ధి) గావించి సంప్రోక్షణ గావించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం అనుమతించారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు, సూపరింటెండెంట్ ముని చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఉష్ణోగ్రతలు
7/2/2023



- తిరుపతి 32 డిగ్రీలు
- చిత్తూరు 33 డిగ్రీలు
- మదనపల్లి 25 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 33 డిగ్రీలు
- వెంకటగిరి 32 డిగ్రీలు
- గూడూరు 33 డిగ్రీలు

# లోన్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలి
### జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి



తిరుపతి (క్రీడ), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో మంగళవారం సైబర్ క్రైం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి పరమేశ్వర రెడ్డి, మహిళా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ రాజా రెడ్డి, రిజిస్టర్ రజనీ వారితో కలిసి మొబైల్ హన్ట్ యాప్‌ను ప్రారంభించి, సైబర్ క్రైం హెల్ప్ లైన్ నెంబర్ 1930 కరపత్రాన్ని ఆవిష్కరించి సైబర్ క్రైం అవగాహన సదస్సు ప్రారంభించారు. మాట్లాడుతూ నేటి సమాజంలో మారుతున్న కాలానుగుణంగా నేర ప్రవృత్తి భౌతిక నేరం నుండి సైబర్ క్రైం, ఆన్‌లైన్ మోసాలుగా రూపాంతరం చెందింది. మని ట్రాప్‌లలో చదువుకోని వారే కాకుండా బాగా చదువుకున్న యువతీ యువకులు విద్యార్ధులు, ఉద్యోగస్తులు, సీనియర్స్ సిటిజెన్ ఎక్కువగా ఈ మాయలో పడి మోసపోతున్నారు. సాధారణంగా సైబర్ క్రైం జరిగినప్పుడు ఎవరికి, ఎప్పుడు, ఎక్కడ సంప్రదించి న్యాయం పొందడం ఎలా అనే విషయం చాలా వరకు ఎవరికీ తెలియడం లేదు. ఆ ఉద్దేశంతోనే ఈ సైబర్ క్రైం అవగాహన సదస్సును ఒక వారం రోజుల పాటు మన జిల్లా వ్యాప్తంగా నిర్వహించి ప్రజలలో చైతన్యం తీసుకురావాలని సంకల్పించామని అందులో భాగంగా మొదటగా నేడు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నందు వైస్ చాన్సలర్ కె. రాజా రెడ్డి, రిజిస్టర్ రజని సహకారంతో ప్రముఖ సైబర్ నిపుణులైన ఇఎల్ నరసింహారావు చేత ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేశామ న్నారు. సైబర్ క్రైమ్ ప్రముఖ నిపుణులు ఇఎల్ నరసింహ రావు మాట్లాడుతూ నేటితరం చిన్నపిల్లల నుండి పెద్దల వరకు సైబర్ నేరాలపై సరైన అవగాహన లోపం కారణంగా సులభంగా సైబర్ నేరగాళ్ళ చేత మోసపోతున్నారన్నారు. అదనపు ఎస్పిలు వెంకటరావు అడ్మిన్, కులశేఖర్ ఎల్అండ్ఓ, విమల కుమారి క్రైం, మునిరామయ్య తిరుమల, డిఎస్పిలు ఎస్పి సురేంద్ర రెడ్డి, ఈస్ట్ మురళీకృష్ణ, వెస్ట్ నరసప్ప, ట్రాఫిక్ కాటమరాజు, పుత్తూరు రామ రాజు, రేణిగుంట రామచంద్ర, శ్రీకాళహస్తి విశ్వనాధ్, శ్రీసిటీ జగదీష్ నాయక్, క్రైమ్ సురేష్, సైబర్ క్రైం సిఐ రామచంద్రరెడ్డి, విద్యార్ధులు పాల్గొన్నారు.

# టిడిపి తీర్థం పుచ్చుకున్న సత్రవాడ

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు రోజు రోజుకు మారుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మాజీ శాసన సభ్యుడు సత్రవాడ మునిరామయ్య, ఆయన తనయుడు సత్రవాడ ప్రవీణ్ వారి సహా చరులు హైదరాబాదులోని పార్టీ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు సుమారు అర్థగంట పాటు శ్రీకాళహస్తి నాయకులతో చర్చించారు. ఈ చర్చల్లో మాజీ ఎంఎల్ఏను తీసుకెళ్ళిన నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తికి సంబంధించిన పాతజ్ఞాపకాలను చంద్రబాబు నాయుడు గుర్తుకు తెచ్చుకున్నారు. సత్రవాడ మునిరామయ్య మంచి వ్యక్తిత్వం, నిజాయితీ గల నేత మళ్ళీ తెలుగుదేశం పార్టీలోకి రావటం శుభ సూచక మన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముని రామయ్యకు ఆతని తనయుడు ప్రవీణ్‌కు మంచి భవిష్యత్తు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. సత్రవాడ కుటుంబం చేరికతో టిడిపికి నూతనోత్తేజం వచ్చిందన్నారు. తన కృషి ఫలించినందుకు సుధీర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేసారు. సత్రవాడతో పాటు పార్టీ కండువాలను కప్పుకున్న వారిలో వైసిపి జిల్లా జనరల్ కార్యదర్శి నాగ భూషణం నాయుడు, సత్రవాడ ముఖ్య అనుచరులు బాల సుబ్రమణ్యం యాదవ్, న్యాయవాది తులసీరాం, మునిశేఖర్ గౌడ్, గుణశేఖర్, మురళీ యాదవ్, మణీంద్ర, లీలామోహన్‌ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి దేశంనాయకులు పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్, మునిరాజా నాయుడు, రాంబాబునాయుడు, ధనంజయనాయుడు, మల్లికార్జున్‌నాయుడు తదితరులున్నారు.

## బంగారం ధరలు
7/2/2023



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5, 373

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,862

## కోడిగ్రుడ్ల ధరలు
7/2/2023



కోడిగ్రుడ్డు :రూ.5.00

1 డజను: రూ.60.00

## స్విమ్స్ ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాసం విజయవంతం



తిరుపతినగరం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి ఆడిటోరియం నందు అతిథి ఉపన్యాసం ఫిలాసఫీ ఆఫ్ పాలియేటివ్ కేర్ అనే అంశంపై మంగళవారం నిర్వహించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లండన్ రాయల్ మర్స్‌డెన్ హాస్పిటల్ నర్సింగ్ ఆఫీసర్ గిల్లిబర్న్ విచ్చేసి ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ రోగులను రోగంతో కూడిన శరీరంగా చూడకుండా సాటి మనిషిగా గౌరవించాలని, రోగుల మరియు వారి బంధువుల ఆందోళనలను దూరం చేసే విధంగా వారితో సౌమ్యంగా మెలగాలని వివరించారు. క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన పెయిన్ అండ్ పాలియేటివ్ కేర్ వింగ్‌ను ఆమె సందర్శించారు. ఈ కార్యక్రమానికి స్విమ్స్ పంచాలకులు డాక్టర్ వెంగమ్మ ముఖ్యఅతిథి గిల్లిబర్న్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ రేడియేషన్ అంకాలజీ విభాగం డాక్టర్ ప్రాణబంధు దాస్, డాక్టర్ అలోక్ సమత్ రే, డాక్టర్లు నాగరాజు, శివకుమార్, ముక్తేశ్వరయ్య, బి.వి.సుబ్రమణ్యన్, డాక్టర్ శ్రీహరిరావు, డాక్టర్ సుధారాణి, డాక్టర్ కె.మాధవి తదిరులు పాల్గొన్నారు.

## కుప్పం ప్రాంతంలో డా॥జి.ఎన్.రెడ్డి సేవలు చిరస్మరణీయం

**- మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**



కుప్పంరూరల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : జిల్లాలోని పులిచెర్ల ప్రాంతంలో జన్మించి దేశవిదేశాలతో పాటు కుప్పం ప్రాంతంలో సంఘ సంస్కర్త డా॥ గోటూరి నారాయణరెడ్డి (జిఎన్‌రెడ్డి)సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర అటవీ,గనులు, విద్యుత్‌శాఖ మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక డా॥ వైసి జేమ్స్ ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో దివంగత జిఎన్‌రెడ్డి విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించి ప్రసంగించారు. 1940, ఫిబ్రవరి 7న పులిచెర్లలో జన్మించిన డా॥ జిఎన్‌రెడ్డి తిరుపతి వ్యవసాయ వర్సిటీలో 1965లో పట్టా పొంది గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. 1979లో రామకుప్పం మండలం విజలాపురంలో ఇండియన్ రూరల్ రీకన్ స్ట్రక్షన్ మూమెంట్ సంస్థ ప్రారంభించి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. సుమారు 60దేశాల్లో ఆయన తన సేవలు అందించారన్నారు. గతమూడేళ్ల క్రితం జిఎన్‌రెడ్డి మృతి చెందడం బాధాకరమ న్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు స్థలంతో పాటు పలు సంస్థలకు భూ,ఆర్థికసాయాలు అందించిన ఆయన సేవలు మరువలేనివన్నారు. జిఎన్‌రెడ్డి సతీమణి రోహిణిరెడ్డి మాట్లాడుతూ తన భర్త చేసిన సేవలు గుర్తుంచుకుని కుప్పంలో విగ్రహ ప్రతిష్ట చేయడం సంతోషకరమన్నారు. తనకుమారుడు రాహుల్ రెడ్డి ద్వారా మరిన్ని అభివృద్ధి పనులు చేపడ్తామన్నారు. వారు ఏర్పాటుచేసిన నూతన కంప్యూటర్ ల్యాబ్‌ను మంత్రి ప్రారంభించారు. కార్య క్రమంలో జడ్పీచైర్మన్ శ్రీనివాసులు, చిత్తూరు ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, రెస్కోఛైర్మన్ సెంథిల్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, ఎమ్మెల్యే వెంకటేగౌడ, రాష్ట్ర హస్తకళల కమిటీ ఛైర్మన్ కొండవీటి నాగభూషణం, మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, ఎంపిపి అశ్విని మురుగేష్, జడీ ్రటిసి ఎడిఎస్ శరవణ, రాష్ట్ర వన్నియకులక్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ వనిత శ్రీను, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు మునస్వామి, హఫీజ్, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాస మూర్తి, ఎపిఐడిసి డైరెక్టర్ నందకుమార్, స్థానిక నేతలు పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పూజలో పాల్గొన్నారు. ఆలయ ఛైర్మన్ కెఎ మంజునాథ్ కుమార్, డైరెక్టర్లు మంత్రికి ఘనస్వాగతం పలికారు. ఆలయ పునర్నిర్మాణం పనుల గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కుప్పంలో నూతన కోర్టు భవనాల నిర్మాణం కోసం న్యాయవాదులు మంత్రికి వినతిపత్రం అందించారు.

## నైపుణ్య విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి : కలెక్టర్



పలమనేరు,బైరెడ్డిపల్లె,ఫిబ్రవరి 7ప్రభాతవార్త: విద్యార్థులలో నైపుణ్య విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం పలమనేరు, బైరెడ్డిపల్లె మండలాలలో ఆయన పర్యటన చేపట్టారు. పలమనేరు మండలం మొరంలోని వెంకటేశ్వర హ్యాచరీస్‌ను ఆయన పరిశీలించారు. హ్యాచరీలో నెలకు రూ.34లక్షల బాయిలర్ పిల్లలను ఉత్పత్తి చేయడం జరుగుతుందని,మన రాష్ట్రంతో పాటు తమిళనాడు రాష్ట్రాలకు బాయిలర్లను సరఫరా చేస్తున్నట్ల చిత్తూరు జిల్లా ఫార్మర్స్ ఇంటిగ్రేటెడ్ మోడల్‌లో భాగంగా రైతులకు బాయిలర్ కోడి పిల్లలను సరఫరా చేసి వాటి పెంపకం అనంతరం తిరిగి తీసుకుంటున్నామని ఎజిఎం నారాయణ స్వామిరెడ్డి, దొరస్వామి రెడ్డి కలెక్టర్‌కు వివరించారు.అనంతరం బైరెడ్డిపల్లె మండలం బేలుపల్లెలోని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థుల ట్యాబ్‌ల వినియోగం పై పాఠశాలలో బోధించిన పాఠ్యాంశాలకు సంబంధించి బైజూస్ యాప్ కంటెంట్‌వల్ల ఉపయోగం,వన్య ప్రాణుల వలన మానవాళికి గల ప్రయోజనాలు తదితర అంశాలపై కలెక్టర్ విద్యార్థులను ప్రశ్నించారు. గణిత శాస్త్రంలో విద్యార్థులు విద్యా ప్రమాణాలను పరిశీలించి వారికి సులభదాయక భోదనతో విద్యాను ఉపాధ్యాయులు అందించాలని నైపుణ్య విద్యతో విద్యార్థులు విద్యను అభ్యసించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.అనంతరం అంగన్వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. హౌసింగ్‌లే అవుట్‌ను పరిశీలించి ఉగాది నాటికి గృహ ప్రవేశాలకు గృహాలను సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. కడప నత్తం గ్రామ సచివాలయాని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన సచివాలయ పనితీరు సంతృప్తికరంగా లేదని పని తీరు మార్చుకోవాలని సిబ్బందిని హెచ్చరించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, వాలంటీర్లు వారంలో మూడు రోజులు బయోమెట్రిక్ హాజరును తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కుమారస్వామి,ఎంపిడిఓ రాజేంద్ర బాలాజీ,డిఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంతృప్తి స్థాయిలో స్వామివారి దర్శనం : కలెక్టర్



చిత్తూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంకు వచ్చే భక్తులకు స్వామి వారి దర్శనం సంతృప్తి స్థాయిలో జరిగేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ హరినారాయణన్ జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి కాణిపాకం దేవస్థానం అభివృద్ధిపై కాణిపాకం దేవాలయ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దర్శనం కలిగేలా చూడాలన్నారు. అలాగే భక్తులకు భోజన సదుపాయం బాగుండేలా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కాణిపాకం ఆలయ ఇఓ వెంకటేశం, చిత్తూరు ఆర్డీఓ డాక్టర్ రేణుక, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## అదానీ కంపెనీలపై విచారణ చేపట్టాల్సిందే

కుప్పం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : అదానీ గ్రూప్ సంస్థలపై కేంద్రం సమగ్ర విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటరమణబాబు డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డా॥ బిఆర్ సురేష్‌బాబు, పార్టీ అధిష్టానం ఆదేశాలతో మంగళవారం కుప్పంలోని ఎల్ఐసి కార్యాలయం వద్ద కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో బ్యాంకుల జాతీయకరణ చేయడంతో పాటు ఎల్ఐసి వంటి సంస్థలు ప్రారంభించి పేద, మధ్య తరగతి ప్రజలకు భరోసా కల్పించిందన్నారు. అయితే భాజపా ప్రభుత్వం అధికారంలో రాగానే ప్రభుత్వ రంగ సంస్థలు, వాటి ఆస్తులను బడా వ్యాపారులకు అప్పగించి ఆర్థిక నేరాలకు పాల ్పడుతోందని విమర్శించారు. ఇటీవల అదానీ గ్రూప్ బ్యాంకుల వద్ద రుణాలు పొంది ఆర్థిక నేరాలకు పాల్పడినట్లు ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు పళని, డికె చంద్రశేఖర్, మురుగేష్, పురుషోత్తం,రాజారాం, జయరాం, శ్రీనివాసులు, ఆనంద్, మునస్వామి, గంగాధర్, బాబు, శంకర్, హరీష్, వెంకటేష్, ప్రమోద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## మార్చి నెలాఖరులోపు శ్రీనివాస సేతు పనులు పూర్తిచేయండి:కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : మార్చి నెలాఖరులోపు రేణిగుంట మార్గం నుండి తిరుచానూరు మాంగో మార్కెట్ వరకు జరుగుతున్న శ్రీనివాస సేతు వంతెన పనులు పూర్తి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. రేణిగుంట మార్గం నుండి రామనుజ కూడలి మీదుగా తిరుచానూరు మ్యాంగో మార్కెట్ వరకు జరుగుతున్న శ్రీనివాససేతు పనుల పురోగతిపై మంగళవారం ఇంజినీరింగ్, అఫ్కాన్స్, ఏఈకామ్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం రేణిగుంట మార్గం, రామానుజ కూడలి వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా షెడ్యూల్ ప్రకారం పనులు చేయడం లేదని, ఎక్కువ మంది మనుషులను పెట్టి ఇచ్చిన గడువు లోపు పనులు పూర్తి చేయాలన్నారు. ఫిబ్రవరి లోపు రేణిగుంట మార్గం, తిరుచానూరు మార్గంలో జరుగుతున్న అప్, డౌన్ ర్యాంపు పనులు పూర్తి చేయాలన్నారు. మార్చి నెలాఖరుకు రేణిగుంట, తిరుచానూరు మార్గంలోని శ్రీనివాససేతు మీద వాహనాలు వెళ్ళేవిధంగా పనులు చేయాలన్నారు. పనుల్లో ఆలస్యం అయితే సహించేది లేదని అనుకున్న ప్రకారం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు కూడా ప్రతి రోజు పనులు పరిశీలించి వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, ఎంఈ 1 చంద్రశేఖర్, డిఈ మోహన్, అఫ్కాన్స్ ప్రతినిధి రంగస్వామి, ఏఈకామ్ ప్రతినిధి బాలాజీ తదితరులు ఉన్నారు.

## శ్రీ సేవాలాల్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి!

**-గోడ పత్రికలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**



తిరుపతి ప్రెస్‌క్లబ్,జనవరి 7 ప్రభాతవార్త: ఈనెల 14,15 తేదీలలో అనంతపురం జిల్లా గుత్తి సమీపంలోని సేవాఘడ్ నందు నిర్వహించే సంత్ శ్రీ సేవాలాల్ 284వ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నందు కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను ఆయన చేతులమీదుగా ఆవిష్కరించారు.తరువాత 'గిరిజన నవ సమాజ్ అధ్యక్షుడు పాలిత్యా శివశంకర్ నాయక్ మాట్లాడుతూ స్థిర నివాసం లేని బంజారాలను గుర్తించి తండాలను ఏర్పాటు చేయించి వారికి సుస్థిరం కల్పించిన మహనీయుడు సేవాలాల్ అని కీర్తించారు.ఈ జయంతి వేడుకల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర,రాజస్థాన్ రాష్ట్రాల నుండి అలాగే దేశం నలుమూలల నుండి వేలాదిమంది భక్తులు పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎస్.హనుమంత నాయక్,చంద్రశేఖర్ నాయక్, భాస్కర్ నాయక్, హరినాయక్, సునీల్ నాయక్, హనుమంత్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు పక్కాగా సేవలు : జడ్పీ సిఇఓ

చిత్తూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: వార్డు సచివాలయాలకు సమస్యలపై వచ్చే ప్రజలకు పక్కాగా సేవలు అందించి వారి సమస్యలను పరిష్కరించాలని జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. 17వ డివిజన్ పరిధిలోని మసీదుమిట్ట వార్డు సచివాలయంను మంగళవారం జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన డిస్‌ప్లేలో వున్న పథకాల లబ్దిదారుల వివరాలను పరిశీలించి అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. అలాగే సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్, మాన్యువల్ హాజరు పట్టీని పరిశీలించారు. వార్డు సచివాయాల పరిధిలో నిర్వహించి స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

## మహాశివరాత్రికి రండి..కలెక్టర్‌కు ఆహ్వానం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలో ఈనెల 13వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డికి ఆహ్వానపత్రికను అందించారు. కలెక్టర్‌ను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఎఇఓ సతీష్‌మాలిక్, ధర్మకర్తల మండలి సభ్యులు మహీధర్‌రెడ్డి,మల్లికార్జున్‌రెడ్డి,రమాప్రభ, కొండూరు సునీత,లక్ష్మీ, ప్రత్యేక ఆహ్వానితులు చింతామణి పాండు, నీల, శ్రీదేవి దేవస్థానం పిఆర్ఓ సిబ్బంది రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ వెంకటస్వామి, వైకాపా నాయకులు లోకేష్‌యాదవ్, కొండూరు నంద, భాస్కర్ ముదిరాజ్, బాలా గౌడ్, సునీల్, తేజ తదితరులున్నారు.

## ఉపాధి పనుల్లో సిమెంటు గోల్‌మాల్

**- రికవరీకి ఆదేశించిన పీడీ శ్రీనివాస్ ప్రసాద్**



వెంకటగిరి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆ పథకం పీడీ శ్రీనివాస్‌ప్రసాద్ హెచ్చరించారు. వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రెండు సంవత్సరాలు ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. మండలంలోని 20 పంచాయతీలకు సంబంధించి ఉపాధి పనులపై సామాజిక తనిఖీల వారు ఇచ్చిన నివేదికల ప్రకారం రికార్డులను పరిశీలించారు. ఉపాధి పనుల ద్వారా నిర్మించే సిమెంటు రోడ్డు తదితర పనుల సిమెంటు పక్కదారి పట్టిందని సామాజికత్వానికి బృందం వెంకటకృష్ణ వద్ద ఒకటిన్నర లక్షల రూపాయలు రికవరీ చేయాలని ఆదేశించారు. రహదారులకు ఇరువైపుల మొక్కలు నాటినట్లు వాటికి నీళ్ల పోసినట్లు బిల్లులు స్వాహ చేశారని సామాజికత్వానికి బృందం చేర్చింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు భాగ్యలక్ష్మి, పీడీ డి.ప్రేమ్‌కుమార్, ఎంపీపీ తనూజరెడ్డి, ఎంపీడీవో కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## తుడా చైర్మన్, ఎంఎల్ఏ నిధులతో... కాలుష్య రహిత చెత్త సేకరణ ఆటోలు



చంద్రగిరి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: తుడా చైర్మన్, ఎంఎల్ఏ నిధులతో నియోజకవర్గానికి 136 చెత్త సేకరణ ఆటోలను డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అందిస్తున్నట్లు నెడ్ క్యాబ్ జిల్లా మేనేజర్ వి.రామలింగయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళ వారం ఎలక్ట్రిక్ ఆటోను ఎంపిడిఓ రమేష్ బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంథన వనరుల శాఖ (నెడ్ క్యాప్) ఆధ్వర్యంలో కాలుష్య రహిత ఆటోలను అందించడంలో ఎంఎల్ఏ ప్రత్యేక చొరవ తీసుకున్న ట్లు తెలిపారు. ఇందులో భాగంగా చంద్రగిరి మండలానికి 22, చిన్నగొట్టిగల్లు 15, ఎర్రావారిపాళ్యంకు 12 ఆటోలు అందజేయడం జరిగిందన్నారు. మిగిలిన మండలాలకు త్వరలోనే ఆటోలను అందించడం జరుగుతుందన్నారు. ఎలక్ట్రిక్ ఆటోల ద్వారా పంచాయతీలకు డీజిల్ ఖర్చులు ఆదా అవుతాయన్నారు. ఎలక్ట్రిక్ ఆటోలకు ఒక కిలోమీటర్‌కు కేవలం 50 పైసలు ఖర్చు అవుతుందన్నారు. అదే డీజిల్ ఆటోలకు కిలో మీటర్‌కు రూ.3.50లు ఖర్చు అవుతుందన్నారు. ఎలక్ట్రిక్ ఆటోలు శబ్ద కాలుష్య నియంత్రణ, కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణకు దోహదపడగలవన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కార్యాలయ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ రవిచంద్ర, పంచాయతీ ఈఓ మహేశ్వరయ్య, సేల్స్ మేనేజర్ రవి, డెవలెప్‌మెంట్ ఆఫీసర్ దిలీప్ కుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.

## సభ్యత్వం తీసుకుని కుటుంబానికి భరోసా కల్పించండి!

**-జనసేన పిఏసి సభ్యుడు డా॥పసుపులేటి హరిప్రసాద్**

తిరుపతి ప్రెస్‌క్లబ్,జనవరి 7 ప్రభాతవార్త: జనసేన పార్టీ శ్రేణులు,అభిమానులు ప్రతి ఒక్కరు ఈనెల 10 నుండి 28 వరకు జరిగే క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని, సభ్యత్వం తీసుకుని మీ కుటుంబాలకు భరోసా కల్పించాలని ఆ పార్టీ పిఏసి సభ్యుడు,ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డా॥పసుపులేటి హరిప్రసాద్ పిలుపునిచ్చారు.మంగళవారం స్థానిక ఓ ప్రైవేట్ హోటల్లో జనసేన రాష్ట్ర, జిల్లా, పట్టణ,వార్డు కమిటీలతో డా॥పసుపులేటి హరిప్రసాద్, నియోజకవర్గ ఆన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్,పట్టణ అధ్యక్షుడు రాజారెడ్డిలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా ప్రమాదవశాత్తూ ఏదైనా యాక్సిడెంట్ జరిగి అంగవైకల్యం చెందితే 50 వేల రూ॥లు, జరగరానిది జరిగితే 5 లక్షల రూ॥లు ఇవ్వడం జరుగుతుందన్నారు. 2024లో రాబోయే ప్రజా ప్రభుత్వంలో అవినీతి,అక్రమాలు,దౌర్జన్యాలకు తావు లేకుండా అవినీతి నిర్మూలనే జనసేన ధ్యేయమన్నారు.పార్టీ పటిష్టత కోసం,అలాగే గెలుపు కోసం ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా అహర్నిశలు కష్టపడి పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర,జిల్లా,పట్టణ,వార్డు కమిటీ సభ్యులు,ముఖ్య నాయకులు, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

## చెంగల్వరాయ స్వామికి ప్రత్యేకాభిషేకాలు



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన చెంగల్వరాయస్వామి ఆలయం లోనూ, తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. సాధారణంగా మంగళవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. కాగా తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయంలో ఉదయం నుంచి షోడషాభిషేకాలు జరిపించారు. పట్టణంలోని పలు ప్రాంతాలకు సంబంధించిన భక్తులు హాజరయ్యారు. సాయంత్రం స్వామికి ప్రత్యేకా లంకారం జరిపించారు.ఇక్కడ విశేష సంఖ్యలో భక్తులు హాజరు కావటంతో ఆలయం ఎదురుగా ఉన్న దుకాణాలతో ఇబ్బంది కర వాతావరణం చోటు చేసుకుంది. ఇక్కడ ప్రత్యేక ఆర్చిలు నిర్మించాలనే ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రతి పాదించారు.

## బీడికాలనీలో ఇండ్లపైనే విద్యుత్‌లైన్లు



తొట్టంబేడు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : నిరుపేద సొంత ఇంటి కలను నిజం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇంటిస్థలాలను పంపిణీచేసి ఇంటినిర్మాణాలను శరవేగంగా పూర్తిచేయాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్నారు. అయితే అధికారులు మాత్రం ఉదాసీనత, నిర్లక్ష్య దోరణితో వ్యవహరిస్తున్నారు. ఈనేపధ్యంలో జగనన్న కాలనీ (బీడికాలనీ)లో ఓ లబ్దిదారుని ఇంటిపైన ప్రమాదకరంగా విద్యుత్‌లైన్లు ఉన్నాయి. దీంతో లబ్దిదారులు భయాందోళనలకు గురవుతున్నారు. లబ్దిదారులు పనిచేయలేమని చెప్పడంతో ఇంటినిర్మాణాలు ఆలస్యమవుతున్నాయి. ఇకనైనా విద్యుత్ అధికారులు స్పందించి ఇండ్లపై విద్యుత్‌లైన్లు లేకుండా చూడాలని అధికారులు చర్యలుతీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## క్రీడలు జీవితంలో భాగం కావాలి : జాయింట్ కలెక్టర్



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: మానసిక ఒత్తిడి తగ్గించుకోవటానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయని జిల్లా జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ అన్నారు. ఎస్వీ వ్యవసాయ కళాశాలలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది, క్రీడలు, వక్తృత్వ, సాంస్కృతిక పోటీలకు ముఖ్యఅతిధిగా విచ్చేసిన జె.సి. మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతికయుగంలో జీవన శైలిలో వస్తున్న మార్పుల వల్ల ప్రతి ఒక్కరూ అనేక రకాలైన శారీరక, మానసిక రుగ్మతలను ఎదుర్కొంటు న్నారని, వీటన్నిటికి క్రీడలు చక్కటి పరిష్కార మార్గమన్నారు. అలాగే సిబ్బంది యొక్క పనితీరు మెరుగుపడటానికి ఈ క్రీడలు, సాంస్కృక కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెలిపారు. ఎస్వీ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు.

## ఫీడ్‌మిక్సింగ్ ప్లాంట్ పనులు వేగవంతం



తిరుపతి,ఫిబ్రవరి 7ప్రభాతవార్త : ఎస్వీగోశాలలో దేశీయగోవులకు అవసరమైన ఫీడ్‌ను తయారుచేసుకునే దిశగా టిటిడి చర్యలు చేపట్టింది. ఇందుకు అవసరమైన మిక్సింగ్‌ప్లాంట్ పనులు వేగవంతం చేయాలని టిటిడిజెఇఓ సదాభార్గవి అధికారులను ఆదేశించారు. అలాగే పుష్పాలతో తయారుచేసే అగరబత్తీల రెండోప్లాంట్ పనులను మంగళవారం ఆమె సందర్శించారు. సిఇ నాగేశ్వరరావు, ఎస్వీపశు వైద్యవిశ్వ విద్యాలయం విసి డాక్టర్ పద్మనాభరెడ్డి, గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథరెడ్డి ఉన్నారు.

## గ్రామాల్లో తాగునీరు సమస్య పరిష్కరించటమే లక్ష్యం : మంత్రి

నింద్ర, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : గ్రామీణ ప్రాంతాలలో తాగునీరు సమస్య పరిష్కరించటమే వైయస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని పర్యాటకశాఖా మంత్రివర్యులు ఆర్‌కె రోజా తెలిపారు. మంగళవారం మండలంలోని జియన్ కంద్రిగ గ్రామపంచాయతీలోని బిజి కంద్రిగ,యంసి కంద్రిగ గ్రామంనందు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన నిధులు అంచన విలువ 11లక్షల రుపాయిలతో మంజూరు చేసిన త్రాగునీటి బోర్,పైపులైన్లకు రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి వర్యులు ఆర్‌కె రోజా స్విచ్‌ఆన్ చేసి ప్రారంబించినారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మి ఓటువేసిన వారికి వేయని వారికి ప్రతి ఒక్కరికి వివిధ పథకాల రుపంలో సహాయం అందజేస్తున్నరని తెలిపారు.2014 నుంచి 2019వరకు నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన 600 వాగ్దానాలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసారని విమర్శిం చారు. రాష్ట్రంలో వైయస్ కాంగ్రెసు పార్టీ ప్రభుత్వం ఏర్పాటై మూడు సంవత్సరాలలో వైకాపా ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలలో 98శాతం అమలు చేసిన ఘనత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దారు అమరేంద్రబాబు,యంపిడిఓ వేణు,యంపిపి దీపాజలంధర్‌రాజు, మండల వైకాపా కన్వీనర్ వేణురాజు,సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్ణారెడ్డి,రాష్ట్ర వైకాపా యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్,కో ఆప్షన్ మెంబరు అనిల్,యంపిటిసి విజేష్,నింద్ర సర్పంచ్‌లు వసంత్ బాబురెడ్డి, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య నాయకులు లక్ష్మిపతి, శివ, రాము, మురళీక్రిష్ణ, మహేష్, సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## యదేచ్ఛగా తెల్లబంగారం అక్రమ రవాణా

**- మర్లపల్లిలో ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్థులు**



నాయుడుపేట రూరల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : నాయుడుపేట మండలం మర్లపల్లి వద్ద స్వర్ణముఖి నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం ఆ గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు, నాయుడుపేట ఎస్ఐ శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నాయుడుపేట మండలంతో పాటు ఐదు మండలాలకు సాగు, తా గునీటిని అందించే వరప్రసాదిని అయిన స్వర్ణముఖి నది ఇసుక అక్రమార్కుల చేతివాటానికి బలై ఎడారిని తలపిస్తోంది. పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి మండలాల్లో కొందరు అక్రమార్కులు ధనార్జనే ధ్యేయంగా నిత్యం రాత్రింబవళ్లు స్వర్ణముఖి నదిని తోడేస్తూ ఇతర ప్రాంతాలకు తరలించి లక్షలు గడిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో నిత్యం వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిపోతున్నా పట్టించుకునే వారు కరవయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీకి చెందిన కొందరు చోటా నాయకులు, ఎంపిటిసిలు, సర్పంచులు ఇసుక అక్రమాలకు పాల్పడుతున్నందు వల్లే సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామస్థులు అడ్డుకున్న ప్రాంతాల్లో తప్ప ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై దృష్టి సారించి వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.


**సూళ్ళూరుపేట పురపాలక సంఘం, సూళ్ళూరుపేట**

ఆర్ ఓసి నెం. 35/2022/ఇ1 తేది : 07-02-2023

mail:sullurpet.mplty@gmail.com/Phone: 7093900652

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు**

సూళ్ళూరుపేట పురపాలకసంఘము నందు సిఎండిఎఫ్ నిధులతో 2పనులకు మరియు సాధారణ నిధులతో 2 పనులకు వెరసి 4 పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండరుదారులు ఇ-మార్కెట్ ప్లేస్, అనగా www.apeprocurement.gov.in నుండి టెండరు షెడ్యూలున్ను డౌన్ లోడ్ చేసుకోనవచ్చు మరియు తదుపరి వివరాలు పొందవచ్చును. టెండర్లు స్వీకరణకు మొదలు తేది 07-02-2023 టెండర్లు వేయుటకు చివరి తేది 21-02-2023.

**మునిసిపల్ కమీషనర్, సూళ్ళూరుపేట పురపాలక సంఘం**